క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ జయప్రకాశ్‌నగర్ నివాసితులు కుశం వర్షిత్, సమ్యమిల పేరిట కుటుంబ సభ్యులు నిత్యాన్నదానానికి రూ. 1,00,116 విరాళం అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు దాతలకు అమ్మవారి చిత్రపటం ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన



పాయకాపురం(విజయవాడరూరల్): ఆయుర్వేద దినోత్సవాల్లో భాగంగా పాయకాపురంలోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో శనివారం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూల్ నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు ఆయుర్వేద పద్ధతులపై అవగాహనకు సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు విద్యార్థులకు ఔషధ మొక్కలు, ఔషధ ద్రవ్యముల ప్రదర్శన, ఆయుర్వేద చికిత్సా పద్ధతులను వివరించారు. విద్యార్థులకు, ప్రజలకు ఆయుర్వేద వైద్యం గురించి ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు ఈ నెల 10వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

విద్యాసంస్థల బంద్ జయప్రదానికి వినతి



కృష్ణలంక(విజయవాడతూర్పు): విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ పరం చేయొద్దని, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ ఈ నెల ఎనిమిదో తేదీన జరిగే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని జిల్లా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు విజ్ఞప్తిచేశారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో విద్యాసంస్థల బంద్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సి.హెచ్. వెంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సాయి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఐ.రాజేష్ మాట్లాడుతూ.. రాష్ట్రానికే తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్రం సిద్ధపడిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయాల కోసం కార్పొరేట్ శక్తులకు విశాఖ ఉక్కును బలి ఇస్తోందన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు, ఏఐవైఎఫ్ నాయకుడు భార్గవ్, వెంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు అయ్యప్ప, పీడీఎస్‌యూ నాయకుడు వసీం తదితరులు పాల్గొన్నారు.

దాసాంజనేయుడికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామి వారి దేవాలయంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు శనివారం నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అక్కినేని నటజీవితం ఆదర్శప్రాయం



విజయవాడ కల్చరల్: అక్కినేని నటజీవితం ఆదర్శప్రాయమని సీనియర్ గాయకుడు శివశర్మ అన్నారు. ఆర్‌అండ్‌బీ సినీ సంగీత సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో అక్కినేని శత జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివశర్మ మాట్లాడుతూ తెలుగు సినీ చరిత్రలో అక్కినేని ధృవతారగా నిలిచిపోయారన్నారు. స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్నట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బీ క్రియాశీలక సభ్యులు ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, టీకే మునికేశవులు అక్కినేని సినీ జీవిత విశేషాలను వివరించారు. సిహెచ్ జ్యోతి, ఎ.ప్రత్యూష, టి.శైలజ, కె.వాణి, పి.లక్ష్మీతులసి, టి.భారతి అక్కినేని నటించిన చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు అక్కినేని చిత్రపటానికి నివాళులు సమర్పించారు.

పేదల పాలిట వరం జగనన్న సురక్ష

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



30వ డివిజన్‌లో మందులను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేదల పాలిట వరం జగనన్న ఆరోగ్య సురక్ష అని నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 30వ డివిజన్ బుడమేరు మధ్యకట్టలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ బీహెచ్ఎస్‌వీ జానారెడ్డితో కలిసి జగనన్న సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 249వ వార్డు సచివాలయం పరిధిలో 3645 మంది ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేసినట్లు తెలిపారు. స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మార్తి చంద్రమౌళి, దుర్గారావు, తుంపాల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో..

31వ డివిజన్ ముత్యాలంపాడు 213వ వార్డు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంను ఎమ్మెల్యే మల్లాది విష్ణు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. సురక్ష శిబిరంలో 1158 కుటుంబాలకు చెందిన వారు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెనుమత్స సత్యం, డివిజన్ కో–ఆర్డినేటర్ పట్టాభిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో..

32వ డివిజన్ అయోధ్యనగర్ 228వ వార్డు సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే మల్లాది విష్ణు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కోఆప్షన్ సభ్యురాలు గుండే సుభాషిణి కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇంఛార్జి గుండే సుందర్‌పాల్, నాయకులు పేరం త్రివేణిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27వ డివిజన్‌లో..

27వ డివిజన్ గులాబీతోట 200వ వార్డు సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరంను ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు కె.రాము తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రుల్లో వైద్యం

పాయకాపురం(విజయవాడరూరల్): సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రుల్లో లభించే వైద్య సదుపాయం ప్రస్తుతం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో కూడా లభిస్తోందని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 61వ డివిజన్ 256వ వార్డు సచివాలయం పరిధిలో శాంతినగర్‌లోని శారదా స్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం, 63వ డివిజన్‌లో మల్లాది వెంకటసుబ్బారావు కమ్యూనిటీ హాలు, 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్లో జరిగిన జగనన్న సురక్ష వైద్య శిబిరాల్లో ఎమ్మెల్యే విష్ణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలోని ప్రభుత్వాసుపత్రిలో గుండెకు సంబంధించిన వైద్యం ప్రస్తుతం అందుబాటులోకి ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. గుండె జబ్బు వారికి ఖరీదైన స్టెమిన ఇంజక్షన్ ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో వుందని ఎమ్మెల్యే విష్ణు చెప్పారు. అదే విధంగా 61వ డివిజన్ 256వ వార్డు సచివాలయ పరిధిలో 950 మందికి వైద్య సిబ్బంది వారంరోజుల పాటు ఇంటింటికీ వెళ్ళి వైద్య పరీక్షలు చేసి టోకెన్లు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి సచివాలయ పరిధిలోని సామాన్య, పేద ప్రజానీకం ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమాల్లో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఉమ్మడి రమాదేవి, మోదుగుల తిరుపతమ్మ, యరగొర్ల తిరుపతమ్మ, నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, ఎండీ రఫీ, కోటేశ్వరరావు, అనిల్, ఆర్ఎస్ నాయుడు, దుర్గాప్రసాద్‌రెడ్డి, నాగిరెడ్డి, రంగారెడ్డి, సిహెచ్ రవి, పసుపులేటి యేసు, యరగొర్ల శ్రీరాములు, డాక్టర్ బాసిద్ తదితరులు పాల్గొన్నారు.



శారదా స్కూల్‌లో జగనన్న సురక్ష క్యాంపులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ఈ శిబిరంలో వివిధ విభాగాల వైద్యులు పాల్గొని పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ప్రాథమికంగా వ్యాధి నిర్ధారనను గుర్తించి తగిన చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతూ శ్రీశైలజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాసరావు, శనగవరపు శ్రీనివాస్, సనత్, కె.ప్రసాద్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా పారదర్శక పాలన



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కుల మతాలు, రాజకీయాలకు అతీతంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా పారదర్శక పాలన అందిస్తున్నారని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 29వ డివిజన్ 208వ వార్డు సచివాలయ పరిధిలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని మల్లాది విష్ణు తెలిపారు. ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను స్వాగతిస్తున్నారని తమ పర్యటనకు వస్తున్న అనూహ్య స్పందనే ఇందుకు నిదర్శనమన్నారు. అలాగే నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరూ డిసెంబర్ 31 నాటికల్లా ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

గత ప్రభుత్వ హయాంలో చేసిందేమీలేదు

టీడీపీ హయాంలో డివిజన్ స్థాయి నుంచి కేంద్రం వరకు అధికారంలో ఉన్నప్పటికీ ప్రజలకు చేసిందేమీ లేదని మల్లాది విష్ణు విమర్శించారు. ప్రధానంగా విజయవాడ నగరం ఆశించినమేర ప్రగతిని సాధించలేకపోయిందన్నారు. కానీ ఈ ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి వాళ్ళ అవసరాలను తీరుస్తున్నట్లు విష్ణు తెలిపారు. ముఖ్యంగా సెంట్రల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సీఎం జగన్ ప్రభుత్వ పాలనా దక్షతకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. కానీ స్కిల్ డెవలప్మెంట్, ఫైబర్ నెట్, అమరావతి నిర్మాణాలు, ఇసుక, మద్యం.. ఇలా నిండా అవినీతిలో కూరుకుపోయిన తెలుగుదేశం మాపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మల్లాది విష్ణు అన్నారు. పేదలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక విపక్షాలన్నీ మూకుమ్మడి దాడిని చేస్తున్నాయని మండిపడ్డారు. అలాగే సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్ల కాలంలో అమలు పరిచిన 98.5 శాతం హామీలు అమలుపై ఎక్కడైనా తాము బహిరంగ చర్చకు సిద్ధమని సవాలు విసిరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు, నాయకులు షేక్ అక్బర్, గోవింద్, హరిబాబు, రమేష్, పూర్ణిమ, నాగమణి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సేవలు అందించాలి

చిట్టినగర్(విజయవాడవెస్ట్): ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి సూచించారు. జక్కంపూడి కాలనీలోని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో శనివారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో భాగంగా జిల్లాలోని ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ సెంటర్ ఉద్యోగుల పనితీరును ఉషారాణి సమీక్షించారు. ప్రతి ఒక్కరూ నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కిరణ్‌పందిటి మాట్లాడుతూ హెచ్ఐవీ కేసులను ఆరంభ దశలోనే గుర్తించి ఏఆర్‌టీ చికిత్స ఇప్పించాలని సూచించారు. అనంతరం విభాగాల వారీగా సమీక్ష నిర్వహించారు.



ప్రశాంతిని సత్కరిస్తున్న ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ సిబ్బంది

ఐసీటీసీ సూపర్‌వైజర్‌కు సత్కారం

ఉద్యోగోన్నతిపై బదిలీపై వెళ్తున్న జిల్లా ఐసీటీసీ సూపర్‌వైజర్ జె. ప్రశాంతి చౌదరిని జిల్లా ఐసీటీసీ, డీఎస్ఆర్‌సీ, ఏఆర్‌టీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. 14 సంవత్సరాలుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఆమె అందించిన సేవలను కొనియాడారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లిన దేవదానంను సత్కరించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లీకులను సరిచేయండి సారూ...



వీవీ నరసరాజు రోడ్డులో...



గద్దే వెంకట్రామయ్యనగర్ మెయిన్ రోడ్డులో...

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే మధురానగర్ వీవీ నరసరాజు రోడ్డు రామాలయం సమీపంలోనూ, గద్దే వెంకట్రామయ్య నగర్ మెయిన్ రోడ్డులో గత వారం రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. ఇక్కడ వాటర్ పంపింగ్ జరుగుతున్నంత సేపూ తాగునీరు రోడ్లపైకి పొంగుతూ ఉంది. దీని వల్ల విలువైన తాగునీరు వృథాగా పోవడంతో పాటు కలుషితం అవుతోందని స్థానికులు వాపోతున్నారు. లీకేజీల వల్ల రోడ్లు సైతం పాడవుతున్నాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు మరమ్మత్తులు చేపట్టిన వాటర్ వర్క్స్ అధికారులు వారం రోజులు గడిచినప్పటికీ మరమ్మత్తులు పూర్తి చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలు సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్ సెక్షన్ అలంకార్ సబ్‌స్టేషన్ 11కేవీ గాంధీనగర్ ఫీడరు పరిధిలోని విద్యుత్ లైన్లు మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఈఈ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉయ్యూరు జమిందార్ స్ట్రీట్, ఆంధ్రరత్న రోడ్, నాగేశ్వరరావు పంతులు రోడ్, అలంకార్ థియేటర్ రోడ్, రామారావు స్ట్రీట్, నర్రావారి స్ట్రీట్, గాల్లవారి స్ట్రీట్, జ్యావిలీవ్ స్ట్రీట్, ఏపీ ఎన్జీవో రోడ్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ సుధాకర్ కోరారు.

చిన్నారులు క్రీడల్లో రాణించాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): చిన్నారులు క్రీడల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చిన్నారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వీరందరినీ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో ఎమ్మెల్యే విష్ణు పతకాలతో శనివారం సత్కరించారు. దేశం గర్వించదగ్గ క్రీడాకారులను తయారు చేయడంలో భాగంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో వీరంతా మరెన్నో అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని.. ఆంధ్రప్రదేశ్ పేరును ప్రపంచ దేశాలకు వ్యాపింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ శివనాగేసన్, క్రీడాకారులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతుకూలీ సంఘం సావనీర్ ఆవిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అటవీ సంరక్షణ(సవరణ) చట్టాన్ని వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరిగిన రైతుకూలీ సంఘం అఖిల భారత ఆదివాసి సదస్సులో వక్తల ప్రసంగాలు, సందేశాలు, తీర్మానాలను సావనీరుగా ప్రచురించినట్లు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.వీరబాబు తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సావనీరు ఆవిష్కరణ సభ జరిగింది. అఖిల భారత ఆదివాసీ సదస్సు–2023 సావనీర్‌ను 'ప్రజా సాహితీ' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు ఆవిష్కరించారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



కొత్త ఓట్ల దరఖాస్తులను బిఎల్ఓలకు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్థానిక 33వ డివిజన్ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాస్ పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత, ఇప్పటి వరకు ఓట్లు నమోదు చేసుకోనివారు, ఇతర ప్రాంతాల నుంచి మారిన వారు తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో గాని, లేదా కార్పొరేటర్ శర్వాణిమూర్తి కార్యాలయంలో కానీ సంప్రదించి తమ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో కొత్తగా నమోదు చేసిన 137 దరఖాస్తులను బీఎల్‌ఓలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శనగవరపు శ్రీనివాస్, సనత్, కృష్ణమోహన్, రవిశంకర్, బీఎల్‌ఓలు సిహెచ్.కనకదుర్గ, వై.జ్యోతిర్మయి, ఎన్.విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ 15 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ



ఆవిష్కరణకు సిద్ధమైన మహానేత కాంస్య విగ్రహం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం భవానీపురం 42వ డివిజన్‌లోని శివాలయం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 15 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరగనుందని వైఎస్సార్ విగ్రహ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మహానేత విగ్రహాన్ని రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరిస్తామని కమిటీ పేర్కొంది. తొలుత సాయంత్రం 4 గంటలకు భవానీపురం స్వాతి సెంటర్ నుంచి విగ్రహం వరకు భారీ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. వైఎస్సార్ అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ పిలుపునిచ్చింది.

ఒలింపియాడ్ పరీక్షల్లో విజేతలకు సత్కారం



ఒలింపియాడ్ పోటీలలో విజేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్యాట్ ఒలింపియాడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటడం అభినందనీయమని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజారాణి అన్నారు. స్థానిక దుర్గాపురం శ్రీ చైతన్య పాఠశాలలో క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో విజేతల అభినందన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మ్యాట్ పరీక్షలో ప్రథమ స్థానం సాధించిన 54 మంది, ప్యాట్‌లో 50 మంది, చాట్‌లో 56 మంది విద్యార్థులను సర్టిఫికెట్ మెడల్స్‌తో సత్కరించారు. విజేతలకు తదుపరి స్థాయి పరీక్షలు నిర్వహించి విజయం సాధించిన వారికి ల్యాప్‌టాప్, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఈజీఎం మురళీకృష్ణ, నరేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

హార్ట్ ఫెయిలైనా ప్రాణం నిలపొచ్చు

కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు, పక్కన డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ సోమనాథ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆధునిక వైద్య విధానాల ద్వారా హార్ట్ ఫెయిలైన రోగిని ప్రాణాపాయం నుంచి తప్పించడంతో పాటు, పదేళ్ల పాటు రోగి జీవన ప్రమాణాలను పొడిగించొచ్చని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు అన్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ హార్ట్ అండ్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ ఆధ్వర్యంలో చెన్నైలో అక్టోబర్ 27, 28 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఆ సదస్సులో హార్ట్ ఫెయిల్యూర్‌పై ఆధునిక చికిత్స, ప్రాణాపాయం నుంచి తప్పించే వైద్య విధానాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపిన అంశాలను డాక్టర్ రమేష్‌బాబు శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో తెలిపారు. గుండె తన సామర్థ్యానికి తగిన విధంగా రక్తాన్ని పంపింగ్ చేయలేని స్థితినే హార్ట్ ఫెయిల్యూర్ అంటారని తెలిపారు. రక్తపోటు, మధుమేహం, రక్తనాళాల్లో పూడికలు, సైలెంట్ హార్ట్ ఎటాక్ వంటివి హార్ట్ ఫెయిల్యూర్‌కు ప్రధాన కారణాలని వివరించారు. క్వాడ్రాపుల్ థెరపీ, ఎమర్జెన్సీ బైపాస్ శస్త్ర చికిత్స ద్వారా హార్ట్ ఫెయిల్యూర్ రోగుల జీవన ప్రమాణాలను ఒక దశాబ్దం పాటు పొడిగించొచ్చని తెలిపారు. హార్ట్ ఫెయిల్యూర్ నిర్ధారణ, సత్వర వైద్య చికిత్స, వైద్య పునరావాసం ఈ చికిత్సలో కీలక అంశాలని పేర్కొన్నారు. కొన్ని ప్రత్యేకమైన డివైజ్‌ల ద్వారా, క్లిష్టతరమైన కరోనరీ ఇంటర్వెన్షన్ ప్రక్రియల ద్వారా హార్ట్ ఫెయిల్యూర్ రోగులకు ఉపశమనం కలిగించొచ్చని తెలిపారు. ఈ సమావేశంలో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు, సీనియర్ కార్డియాలజిస్టులు డాక్టర్ సోమనాథ్, డాక్టర్ అనూప్, ప్రత్యేక ఎక్మో స్పెషలిస్టు డాక్టర్ బికాస్ సాహూ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



తెలంగాణా బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో కృష్ణతేజ

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన లఘు చిత్రాల దర్శకుడు, నిర్మాత, నటుడు పీఆర్‌పీ కృష్ణతేజ తనకు తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలో చోటుదక్కినట్లు నిర్వాహకుల నుంచి సమాచారం అందిందని సంబంధిత నమోదు పత్రం అందజేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కృష్ణతేజ నటించి దర్శకత్వం వహించిన మనోరంజని లఘు చిత్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై 100 పైగా అవార్డ్స్ పొందిన సందర్భాన్ని గుర్తించి తెలంగాణా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ అవార్డ్‌ను అందించింది. ఈ సందర్భంగా సుమధుర కళానికేతన్‌తో పాటు ఇతర సంస్థలు కృష్ణతేజను అభినందించాయి.

మధురానగర్ విద్యుత్ సెక్షన్‌ను పరిశీలించిన డీఈఈ



రికార్డ్స్ పరిశీలిస్తున్న బసవరాజు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఓ.బసవరాజు శనివారం మధురానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ సెక్షన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మధురానగర్ సెక్షన్‌లో విద్యుత్ వినియోగం, తీసుకుంటున్న చర్యలు తదితర వివరాలు ఏఈ శివారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యుత్ అవసరాలకు అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



తైక్వాండో జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన రాజా రామ్మోహన్‌రాయ్ హైస్కూల్ క్రీడాకారులు

గుణదల(విజయవాడ తూర్పు): స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో రాజా రామ్మోహన్ రాయ్ హై స్కూల్ క్రీడాకారులు సత్తాచాటారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల రెండో తేదీన జరిగిన ఈ పోటీలకు స్కూల్ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించి 14 బంగారు పతకాలను కైవసం చేసుకోవడంతో పాటు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. అండర్–14 బాలికల 22–24 కిలోల బరువు విభాగంలో డి.కార్తీష, 26–29 కిలోల విభాగంలో పి.తేజసత్య సాయి, 29–32 కిలోల విభాగంలో కె.విష్ణుప్రణతి, అండర్–17 బాలికల 32–35 కిలోల విభాగంలో పి.ప్రణవి, 35–38 కిలోల విభాగంలో వి.మేరి బ్యూల, 38–42 కిలోల విభాగంలో పి.ధరణి, 42–44 కిలోల విభాగంలో ఎం.సిరివల్లి, 44–46 కిలోలవిభాగంలో పి.కృష్ణప్రియ, 52–55 కిలోల విభాగంలో ఎం.భానుప్రియ, 63–68 కిలోల విభాగంలో వై.ప్రియాంకనాయుడు, అండర్–17 బాలుర 41–45 కిలోల విభాగంలో వి.ఎం.ఎస్.ఎస్.వర్మ, 48–51 కిలోల విభాగంలో కె.చైతన్య, 55–59 కిలోల విభాగంలో టి.సంతోష్, 63–68 కిలోల విభాగంలో పి.శివశంకర్ బంగారు పతకాలు సాధించారు. జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, అత్యుత్తమ శిక్షణ ఇచ్చిన కోచ్ ఎం.అంకమ్మరావును స్కూల్ డైరెక్టర్ మదనమోహన్, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో శనివారం అభినందించారు.